కథానిక

# వల్లభాభిసరణము

"మంజుశ్రీ"

చంద్రరావు ఊళ్ళోకి వచ్చాడని తెలియగానే శశి రవిఅచ్చిన మల్లెమొగ్గ అయింది. సిగ్గుల చిన్నారి రామచిలక అయింది. వేచివేచి, ఇన్నాళ్లు కళ్లు కాయలు కాచినతర్వాత దేవుడు ప్రత్యక్షమైనాడు శశికి. ఒక యేడా, రెండేళ్లా, ఐదేళ్ళ తర్వాతనా మళ్ళీ కనపడటం! ఇంట్లో తండ్రి మళ్ళీ పెళ్ళిచేస్తానని బింకాలు పలుకుతున్నాడు. తల్లి మొత్తుకుంటున్నది. తను చంద్రరావుకు హృదయం అర్పించింది. మళ్ళీ హృదయ ఫలకంమీద యింకొకరి బొమ్మ ఎలా వేయగలుగుతుంది? తన దేవుడు ఎక్కడన్నా అగుపడతాడేమోనని ఇన్నాళ్ళనుంచి తాను వెతుకుతున్నది. ఇవ్వాళ్టికి కనికరించి దేవాలయంలో ప్రత్యక్షమైనాడు.

ఆడవాళ్ళకు ఏ విషయంలోనైనాసరే అతి తొందర. రాజ్యాలురాజ్యాలే కూలిపోయాయి. సోదరుసోదరులే చంపుకున్నారు వాళ్ళవల్ల. లక్ష్మీదేవి కింత తొందరెందుకో మరి. పోయి శశి చెవిలో వూదింది. శశి సాయంకాలం పార్వతీదేవికి పూజ చేసిరావాలని బయలుదేరితే గుళ్ళో ధ్వజస్తంభం దగ్గర చంద్రరావు అవపడ్డాడు. తాను వెనక్కి తిరిగి వెళ్ళిపోబోతుంటే తియ్యగా శశీ అని పిలిచాడు. తాను కరిగిపోయింది. ఆత్మనివేదన చేసుకున్న భక్తుడు పరమాత్మ ప్రత్యక్షమైతే ఎంతగా పొంగిపోతాడోఅలా అపిలుపులోనిమాధుర్యం శశిని పరవశురాలినిగా చేసింది. హృదయం ప్రేమతోటి నిండిపోయింది. లేగదూడ తల్లిని అనుసరించినట్లుగా చంద్రరావు వెనకనే కోనేటి గట్టుమీదికి నడిచింది శశి. కాస్త దూరం నడిచి కోనేటి గట్టుమీద కూలబడ్డాడు చంద్రరావు. శశి కూడా పక్కనే కూచుంది. చంద్రరావు ముఖంలోకిచూసే ధైర్యం శశికి లేదు. సిగ్గు తలమీదవచ్చికూచుంది. తలవంచుకొని కోనేటినీళ్ళలోకి చూస్తున్నది. తమాషాగా నాచు కదలాడుతున్నది. కోనేటినిండా తామరాకులే. అక్కడక్కడ రెండుమూడు పూలు కనపడుతున్నాయి. బుజంమీద చెయివేసి శశిని దగ్గరగాలాక్కున్నాడు చంద్రరావు. శశి కుదించుకపోయింది. గడ్డం పట్టుకుని, ముఖమెత్తి కళ్ళలోకి లాలనగా చూశాడు. శశి కళ్ళలో నీళ్ళు తిరిగినయి. చంద్రరావు వాటిని తుడిచి "ఏమిటి శశీ" అన్నాడు శశి చిరునవ్వు తెప్పించుకుంది. "ఇంతకాలం ఎక్కడున్నారు" అన్నది. చంద్రరావు నవ్వుకొని తర్వాత చెపుతాలే అన్నాడు.

చంద్రరావుకు ఓ కొంటె ఊహ మెరిసింది. శశిని తల తిప్పి కాస్తంత దూరంలో తమాషా చూపించాడు. ఏమిటీ అని శశి ఉత్సుకతతో చూసింది. రెండు పావురాళ్ళు ఆవతల గట్టుమీద మూతులు కలుపుకుంటున్నయి. శశి మహాలావు సిగ్గుపడిపోయింది. చంద్రరావు కళ్ళలోకి ఎర్రగా చూసింది. చంద్రరావు శశి చెవులో ఏదో గుసగుసలాడాడు. చీకటిపడింది. ఇద్దరూ లేచారు. చుక్కలు మిలమిల మెరుస్తున్నాయి కోనేటిలో. శశి నడుంచుట్టూ చేయేసి గట్టుదిగిందాకా నడిపించుకొచ్చాడు చంద్రరావు. శశి ముఖం రెండుచేతుల్లోను పొదివిపట్టుకొని నున్నటి బుగ్గల్ని చేతులతో రాస్తూ "నా శశీ" అన్నాడు చంద్రరావు. శశి కరగిపోయింది. చంద్రరావు స్నేహితుడింటికి వెళ్ళిపోయాడు. శశి మబ్బుల్లో తేలిపోతున్నంత హాయిని అనుభవిస్తూ ఇంటికి నడచివచ్చింది.

"లక్ష్మింటికీ వెళ్ళివస్తానని యింతసేపెక్కడికెళ్ళావు తల్లీ" శశి తల్లి అడిగింది.

"శివాలయానికి..." శశి సమాధానంచెప్పింది.

"వచ్చిన అప్రతిష్ఠ చాలు. ఇప్పటికే నలుగురి నోళ్ళలో నానుతున్నాము. ఇక సంసారం చెయ్యలేను. ప్రొద్దుపోయిందాకా ఆలయంలో కూచుంటే ఎలా తల్లీ? ఇంటిదగ్గర పొక్కడాన్ని చావాలా? గొడ్లు కట్టేసేపని కూడా నేనే చెయ్యాలి. మొగపిల్లలున్నారు ఎందుకు, నా ఖర్మ." తల్లి ఉద్వేగంతో మాటాడుతుంది.

శశి కళ్ళనిండా నీళ్ళుతిరిగినయ్. గోడమొత్త కానుకొని కూలబడిపోయింది. పడమటింట్లోంచి నేతిగిన్నె పట్టుకొస్తూ ఆముదపు దీపపు వెల్తురులో శశి కళ్ళలోని ఇంద్రధనస్సులను తల్లి చూసింది. హృదయం కరగిపోయింది. వాత్సల్యం కట్టలు తెంచుకుంది. తలనిమురుతూ "నీకోసమురా తల్లీ, పొద్దున్ననంగా నాలుగుమెతుకులు కొరికావు" అన్నదామె. శశి లేచి దొడ్లోకి వెళ్ళిపోయింది. బొండుమల్లెచెట్టు సరిగ్గా నాలుగు పూలుపూచింది. పొద్దుపోయి వెన్నెలొచ్చింది. అప్పుడే చంద్రుడు పైపైకి పాకుతున్నాడు. శశి కివాళ మనసు మనసులో లేదు. సంతోషం పట్టపగ్గాలు లేకుండా ఆమెను ఆక్రమించుకుంటున్నది. ఆనందం హద్దులు దాటుతున్నది. కాకరపాదుదగ్గర బండమీద కూచుని పైకొచ్చే చంద్రుణ్ణి చూస్తూ కూచుంది శశి. ఎంతసేపటికి ఇంట్లోకి రాకపోయేటప్పటికి, బిడ్డ మనసు ఎంత నొచ్చుకుందో అని తలచుకొనేటప్పటికి హృదయం భారమై, తల్లి వచ్చిచూసింది. శశి అలానేకూచుంది. "శశీ! రావేమిటే, పళ్లెంలో అన్నంబెట్టుకూచుంటేను" అన్నది తల్లి. శశి లేచి తల్లిని కౌగలించుకొని "అమ్మా" అన్నది. కళ్ళలోకి చూస్తూ తల్లి "ఏమిటే?" అంది. శశికేమిచెప్పటానికీ తోచటం లేదు. ఏదో చెప్పాలి. మనసు తియ్యనై మాట పెగలిరావటంలేదు. తల్లి అన్నది "ఏమిటె తల్లీ" అని.

"అమ్మా! మరే..."

తల్లి నవ్వుకుంది. కొత్తచీర కొనిపెట్టమనో! కాళ్ళ పట్టాలు అరగిపోయినాయనో, లేక వాళ్ళమ్మాయి నెక్లెస్ చేయించుకుందనో చెప్పటానికి ఇదంతా ప్రయత్నమని ఆవిడనుకుంది. శశి కాసేపు తమాయించుకొని—

"అమ్మా! వారొచ్చారే" అంది.

"ఎవరే?" తల్లి ప్రశ్న.

"వారు."

"ఎవరే వారు?"

"వారేనమ్మా!"

"ఎవరమ్మా వారు?"

శశికి కోపంవచ్చింది. తల్లి ఇంతసేపు యింత విడమర్చి చెప్పినా కనుక్కోలేకపోవటంలో అర్థం లేదు. ఏమని చెబుతుంది?

"ఎవరు! మావారు, మా ఆయన" అంది శశి యేకంగా. తల్లికి సప్తసముద్రాలు పొంగి, కులగిరులు కదలి, భూవలయమంతా సంచలనం పొందినంత పనైంది. అత్యాశ్చర్యం అవరించింది. ఆవిడకి చంద్రారావు వచ్చాడని తెలుసుకోవటానికి ఐదు నిముషాలు పట్టింది. తరువాత కూతురు చివరన్న మాటలు మదిలో ప్రతిధ్వనించి గలగల నవ్వింది. తలను హృదయంలో హత్తుకుంది. శశి అమాయకంగా తల్లికళ్ళలోకి చూసింది.

"ఎవరు చెప్పారు? నువ్వు చూశావా? ఇంకా కోపం పోలేదా? ఇక్కడికి రాడా?" తల్లి సమాధానాన్నైనా అపేక్షించకుండా ప్రశ్నల వర్షం కురిపిస్తున్నది.

శశి వొక్కొక్కదానికీ తాపీగా సమాధానం చెప్పుతున్నది. "నిన్నవచ్చారుట. ఇవ్వాళ ప్రొద్దున లక్ష్మివచ్చి నాకు చెప్పింది. ఎవరికీ చెప్పకు లక్ష్మి అని చేతిలోచేయి వేయించుకున్నారు. కోపమేమీ లేదుట. ఇంటికివస్తేమటుకు నాన్నగారు సరిగ్గా మాట్లాడిస్తారా! ఆయనగారి స్నేహితుడుండలే, అక్కడున్నారుట. మరే ఇందాకనే శివాలయంలో ధ్వజస్తంభం దగ్గర అవపడ్డారు."

"అందుకెళ్ళావన్నమాట. ఆలయాని కొస్తాడని నీకెలా తెలుసు?"

"పోమ్మా" శశి కొంటెగా చూసింది తల్లికళ్ళలోకి.

ఎలావున్నాడు?

బాగానేవున్నారు.

"నాన్నగారికి చెప్పి ప్రొద్దుటే—" తల్లిభావం పూర్తిగా బయటపెట్టకముందే తల్లికళ్ళలోకి భయం భయంగా చూసింది శశి.

రెక్క పట్టుకొని ఇంట్లోకి నడిపించుకుని వెళ్ళింది శశిని తల్లి. కమ్మగా భోజనంచేసి, తియ్యగా కలలుకంటూ హాయిగానిద్రపోయిందిశశి.

తల్లికి నిద్రపట్టటంలేదు. శశితండ్రి బాగా పొద్దుపోతేగాని పేకాటవదులుకొని ఇంటికిరాడు. శశి తల్లి వసారాలో కూచుని, మనసులో భగవంతుణ్ణి కోటిసార్లు స్మరించి, జరుగబోయే కార్యక్రమాన్ని గురించి మథనపడటం మొదలెట్టింది. సరిగ్గా ఐదేళ్ళక్రిందట శశి పెళ్ళయింది. శశితండ్రి తిరిగితిరిగి చంద్రరావు సంబంధం ఖాయంచేసుకుని

వచ్చాడు. చంద్రరావు అందంగానే వుంటాడు. అందరూ సంబంధం మెచ్చుకున్నారు. చిలకా గోరింకలవలె వున్నారన్నారు. శశి ఇద్దరన్నలూ, ఇంటిదగ్గర్నుంచి అంతోయింతో తెప్పించుకుంటూ పట్నంలో కాపురాలు చేస్తున్నారు. పెళ్ళికి బంధువులంతా తరలివచ్చారు.

పెళ్ళి సజావుగా సాగిపోయేది. అంతా సవ్యముగా జరిగి అప్పగింతలదగ్గర కొచ్చేటప్పటికి ఇరు తెరగుల వారిలో కలతలు కలిగినై. నవ్వులాటల్లా తిట్టుకునేదాకా వచ్చింది. సంప్రదాయ లెంచుకున్నారు. మీరెంతంటే మీరెంత అనుకున్నారు. కోపాలు తాపాలు పెచ్చుపెరిగిపోయినై. శశిని అత్తారికి అప్పగించటం జరగలేదు. వియ్యాలవారు ధాం ధూంలుచేసి అబ్బాయికి పదిరోజుల్లో పెళ్లి చేస్తామని బెదిరించి వెళ్ళిపోయారు. శశి తండ్రి మా అమ్మాయికి రేపే పెండ్లిచేస్తానన్నాడు కోపంలో. అప్పగింతల పాన్పుమీద చంద్రరావు జాలిగా శశి కళ్ళలోకి చూశాడు. శశి కళ్ళలో నీళ్ళు తిరిగినై. ఇద్దరూ మూగభాష మాటాడుకున్నారు. చంద్రరావు తండ్రికి ఎదురుతిరిగి ధైర్యం చేసి శశి చెయ్యిపట్టుకొని వెళ్ళిపోదాం రమ్మన్నాడు. శశి అన్నలు కస్సుమన్నారు. మర్యాదలేని వాళ్ళతోటి హీనంగా మా వొక్కగానొక్క చెల్లెల్ని యింత రభసజరిగిన తర్వాత పంపిస్తామా? అన్నారు. చంద్రరావు సిగ్గుతో వెళ్ళిపోయాడు. పూజా గృహంలో మోకరిల్లి శశి హృదయం పగిలేటట్టుగా తోచింది. శశితల్లి ఎంతగానో ప్రయత్నించింది కూతురిని అత్తగారింటికి పింపించాలని. కొడుకులామెమాట వినలేదు. మొగుడసలే పెడవాడు. ఆయన అనుకున్నదానికి తిరుగులేదు. శశితల్లి భావిలో పడతానని బెదిరించింది. పడమన్నాడు శశి తండ్రి.

చంద్రరావు తండ్రి కొడుకు నలుగురితో తన నవమాన పరిచాడని ఇంటికి వచ్చినప్పటినుంచీ చంద్రరావు సంగతి ఎనరికీ తెలీదు.

అత్తారి వూళ్ళోని స్నేహితుడిద్వారా ఎప్పటి సంగతులు అప్పుడు తెలుకుంటుంటే వాడు చంద్రరావు. పన్నేండళ్ళ శశిని ఐదేళ్ళు వదలివుండిన చంద్రరావు తాను పెద్ద ఆఫీసరై, శ్రీ కృష్ణుడు రుక్మిణీదేవిని ఎత్తుకపోయినట్లుగా ఎత్తుకపోదామని వచ్చాడు.

శశిని చూడగానే చంద్రరావు హృదయం విప్పారింది. చెప్పాడు. చెప్పా పెట్టకుండా తనతోటి వచ్చేసెయ్యమన్నాడు శశిని.

శశితల్లికి చెప్పింది. తండ్రికి చెప్పటం తగునా తగదా అని శశితల్లి మథనపడుతున్నది. శశికి తండ్రంటే భయం. అత్యవసరముంటేతప్ప తండ్రితో మాట్లాడదు. ఆయనా ఇంట్లోవాళ్ళను ప్రేమాదరాలతోటి పలుకరించాడు. రెండుపూటలా భోజనం చేసి చుట్ట నోట్లోపెట్టుకుని పేకాట ఆడటంతప్ప ఆయన కింకేపనీ పట్టదు.

శశితల్లి చివరకు ఆయనకు చెప్పకుండా వుండటానికే నిశ్చయించింది. కాని తన కూతురు, పెద్దపెట్టున చీరాసారె తీసుకొని వొడికట్టు బియ్యంతో యింటినుంచి కదలిపోవటట లేదన్న సంగతి ఆమె స్మృతిపథంలో మెదలి ఆమె కుమిలిపోయింది. కాని తన కూతురు సుఖపడాలి ఎలానోలా ఇంకా నయం. దేవుడు తమ యందుండబట్టే ఇవాళ చంద్రరావు వచ్చాడు, అనుకుంది. ఆమె.

మర్రోజు శశికీ చంద్రరావు ఆలయంలో మళ్ళీ కన్పించాడు. ఆరాత్రి శశి నిద్రపోలేదు. తల్లిసంచి నిండా వీలైన మంచి మంచి చీరలు పర్దింది. శశిని సింగారించింది. అరు బయట శశి తండ్రి గుర్తుకొడుతున్నాడు. తెల్లతెల్ల వారుతుందనగా శశి తల్లిని కౌగలించుకుని భోరుమంది. తల్లి కన్నీళ్ళు తుడచి, లక్ష్మికి రెండు రోజుల కోసారి వుత్తరం వ్రాసేలా కూతురిచే పదేపదే ఒట్టు వేయించుకుంది. శశి తలలో బొండు మల్లెపూలు పెట్టి గడ్డంపుణికి ముద్దెట్టుకుంది తల్లి. తన తల్లి ఇంటి నుంచిఅలా పోవటం ఆమెకు ససేమిరా ఇష్టంలేదు. కాని ఆమె యింకేమీ చెయ్యలేదు. ఇప్పటికే పదివేలు, ఆ భావనే ఆమె మనసులో శాశ్వతంగావుండిపోయింది. శశి కదలి చంద్రరావు స్నేహితుడి యింటిముందుకొచ్చి నిలిచింది. చంద్రరావు బయట కనిపెట్టుక అరుగుమీద కూచుని వున్నాడు. స్నేహితుడు పక్కన నిలబడి మాటాడుతున్నాడు. శశి వచ్చి ఇంట్లోకి వెళ్ళిపోయింది. బండివచ్చి బయట ఆగింది. లోపల స్నేహితుడి

భార్య శశికి పసుపూ కుంకుమాయిచ్చి, పూలూ పండ్లూ సంచిలో పెట్టింది. తెల్లవారేలోగా బండి కదలాలి అన్నాడు స్నేహితుడు.

శశి బండి ఎక్కింది. వచ్చేయేడొచ్చేటప్పుడు 'ఏం తెస్తావొదినా' స్నేహితుడిభార్య శశిని అడిగింది. ఏం తెమ్మంటావమ్మా? శశి సన్నగా అడిగింది. "నాకో కోడలు కావాలిసుమా వచ్చేయేడు వచ్చేటప్పుడు ఎత్తుకొని రావాలి," అంది చంద్రరావు స్నేహితుడిభార్య పకపక నవ్వుతూ.

బండెక్కుతూ చంద్రరావు కొంటెగా నవ్వాడు. శశి చురచురచూసింది. బండి కదలింది. పొలిమేరదాకా స్నేహితుడు బండివెనకనే నడిచాడు.

మర్రోజు వూళ్ళో గుప్పుమంది శశి లేచిపోయిందని. శశి తల్లికీ లక్ష్మిదేవికీ, చంద్రరావు స్నేహితుడికి, శశికి కాబోయే వియ్యపురాలికీతప్ప శశిమొగుడుతోనే లేచిపోయిందని ఎవరికీ తెలీదు.

కథానిక

# ధర్మాత్ముడు

కూరపాటి శ్రీరాం

నెల రోజులు సెలవుపెట్టి ప్రకాశాన్ని చూద్దామని వాళ్ళ ఊరికి వెళ్ళాను. ప్రకాశం నన్ను చూడగానే "ఒరే, నువ్వట్రా? ఆఫీసరుగారికి మమ్మల్ని దర్శించడానికి సమయం ఇప్పుడు చిక్కిందన్నమాట!" అని అన్నాడు వ్యంగ్యంగా. "ప్రకాశం ఇప్పుడేవచ్చానా, కాస్సేపు రెస్టు తీసుకోనియ్యి. తర్వాత ప్రారంభించు నీ వేళాకోళాలు" అని నేను అనాల్సొచ్చింది.

భోజనంచేసి యిద్దరం సావధానంగా కూర్చున్నాము. నాకు వెంటనే రంగన్న జ్ఞాపకంవచ్చి "ప్రకాశం, ఇప్పుడు రంగన్న యేం చేస్తున్నాడ్రా? నేను వచ్చానని ఒకసారి కబురు చేద్దూ, పాపం, నేనంటే దేవులాడుతూ వస్తాడు" అన్నాను. ప్రకాశం "రంగన్నకి కబురుచెయ్యనక్కర్లేదు. వాడీ ప్రపంచంలో లేడు. బకెట్‌ని కిక్ చేసేశాడు" అని అన్నాడు.

నాకూ చాలా ఆశ్చర్యం వేసింది. రంగన్న మా పొలంప్రక్కనే యీ వూళ్ళో రెండెకరాల భూమిని దున్నుకుంటూ బ్రతికే మోతుబరి! మోతుబరి అని ఎందుకనాల్సివచ్చిందంటే—అతనికున్న భూమిని గురించి, అతని స్వాతంత్ర్యజీవిత లక్ష్యాన్ని గురించీ అటువంటి అతని స్వేచ్ఛాపిపాసే నన్ను అతనికి సన్నిహితుణ్ణిచేసింది. అతనంటే నాకదో విధమైన అభిమానం. అతనికి నేనంటే అమిత ప్రాణం; అధిక గౌరవం. ఎప్పుడు ఈ వూరొచ్చినా నేనూ, వాడూ (నాకు అతనికిగల చనువుబట్టి అతనిని "వాడు" అనడం నాకు పరిపాటి) అలా పొలాలగట్ల మీంచి షికార్లు కొడుతూ అనేక విషయాలు మాట్లాడుకొనే వాళ్ళం. రెండెకరాల భూమికీ, తనకీ తప్ప ఈ ప్రపంచంలో రంగన్నకీ మరింకే వ్యక్తికీ నాకూ, వాడికీ ఉండేంత చనువు, అనుబంధం లేదని ఢంకామీద దెబ్బకొట్టి చెప్పవచ్చును. అసలు నా యీడువాడే వాడుకూడా. అలాంటి నేనిలా నూట ఇరవై పౌన్లు తూగుతూ నిక్షేపంలా దుక్కలాగ ఉండటమేమిటి? రంగన్న చావడమేమిటి? చాలాఆశ్చర్యంగా ఉంది. దాంతో నాకు విసుగువేసి "ఏరా ప్రకాశం! నువ్వ నేదేమిటి? హాస్యమాడుతున్నావా? గంగన్న ఇప్పుడెక్కడుంటున్నాడ్రా అంటే వెధవ జవాబు చెప్తావేమిట్రా?" అన్నాను తీక్షణంగా.

వీరన్నకి వూరిలో 15 వేల రూపాయల కిమ్మత్తుచేసే ఇల్లుఉంది. అదికాక సేద్యం చేసే పొలం. అసలు వీరన్నకూ రంగన్నకూ నేనెరిగుండగా సంబధం యేమీ లేదు. అలాంటప్పుడు రంగన్న చనిపోయాడంటూ నన్ను ప్రకాశం కంగారులో ఉంచడం నాకు మహా చిరాకెత్తించింది. అసలు సంగతి సవిస్తరంగా తెల్పమన్నాను ప్రకాశాన్ని.

ప్రకాశం మొదలెట్టాడు. "నీకు ఈ వూళ్ళోని ధర్మారావుగారు తెలుసు కదూ! ఆయనే—ఆ పెద్దమనిషే రంగన్నని చంపిస్త" ప్రకాశం ఒక లిప్త